క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 45 కేసులు పరిష్కారం

మద్దిపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 50 కేసుల్లో 45 కేసులు శనివారం లోక్ అదాలత్‌లో పరిష్కారమైనట్లు ఎస్సై శ్రీరామ్ తెలిపారు. న్యాయమూర్తుల సమక్షంలో కక్షిదారులు రాజీపడినట్లు చెప్పారు. ఇవి కాకుండా మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్న 626 మందిపై మద్దిపాడు పోలీసులు కేసులు నమోదు చేయగా, ఆ కేసులను కూడా లోక్ అదాలత్‌లో సమర్పించినట్లు ఎస్సై తెలిపారు. వారికి స్వల్పంగా జరిమానా విధించి మరోమారు వాహనాల రాకపోకలకు ఆటంకం కల్పించరాదని లోక్ అదాలత్ జడ్జి ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూరల్ మండలం ఏర్పాటుకు కృతజ్ఞతలు

ఒంగోలు రూరల్: ఒంగోలు కార్పొరేషన్‌ను అర్బన్ మండలంగా, ఒంగోలు మండలంలోని గ్రామాలను రూరల్ మండలంగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడంపై మండలంలోని కరవది‌కి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులంతా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చిరకాలంగా ఒంగోలు మండల ప్రజానీకం ఎదురుచూస్తున్న రూరల్ మండలాన్ని ఏర్పాటు చేయడంపై వారంతా సంతోషం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో మిడసల కృష్ణ, సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఎంపీటీసీ 1, 2 మన్నె శ్రీనివాసరావు, జి.కోమలి, ఎస్.అంకమ్మరావు, దార్ల బాబూరావు, తొట్టెంపూడి యలమంద, మేడికొండ కోటేశ్వరరావు, ప్రసన్నకుమార్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, క్రాంతి, పాలపర్తి రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి, పేరకం సుబ్బారావు తదితరులు ఉన్నారు.

98 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శనివారం లింగంగుంట్లలో 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పక్షవాతం, కిడ్నీ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఓ పద్మజ, ఏఎన్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

నిస్సీ పాస్టర్ల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం నిస్సీ పాస్టర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం సంతనూతలపాడులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జీ విలియమ్స్, వైస్ ప్రెసిడెంట్‌గా ఏ లాజర్, సెక్రటరీగా పీ జాన్‌బాబు, ట్రెజరర్‌గా రవికుమార్‌ను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రమేష్, ఎంఏ బాబును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సభ్యులు అభినందించారు.

తెలుగు సినిమాకు గౌరవాన్ని తెచ్చిన విశ్వనాథ్

ఒంగోలు టౌన్: అపురూపమైన సినిమాలతో ప్రఖ్యాత దర్శకుడిగా పేరొందిన కె.విశ్వనాథ్ తెలుగు సినిమాకు గుర్తింపు, గౌరవాన్ని తెచ్చారని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ కొనియాడారు. చందూ అకాడమీ ఆధ్వర్యంలో 50 మంది చిన్నారులు శాస్త్రీయ నృత్యాలతో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ప్రాంగాణంలో శనివారం కళాతపస్వికి కళాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాగభైరవ మాట్లాడారు. సౌండ్ రికార్డిస్టుగా సినిమా రంగంలోకి అడుగిడిన విశ్వనాథ్.. ఆత్మగౌరవం సినిమాతో దర్శకుడిగా మారి తెలుగు సినిమా ఆత్మగౌరవంగా చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. దర్శకుడిగా, నటుడిగా విశ్వనాథ్ తెలుగు సినిమా చరిత్రలో స్థానం సంపాదించారని కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే, రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డులు అందుకున్న ఆయన.. కళాతపస్విగా సార్థక నామధేయుడయ్యారన్నారు.

మడనూరు ముస్తాబు



మడనూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం



రథోత్సవం (ఫైల్)



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న గర్భగుడి



ఆలయం ఎదురుగా ఉన్న కోనేరు

- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు
- 17 నుంచి ఐదు రోజుల పాటు తిరునాళ్లు
- అధిక సంఖ్యలో పాల్గొననున్న భక్తులు

మడనూరు (కొత్తపట్నం):

జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ గంగా పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. ప్రతి ఏడాది ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సతీమణి శచీదేవి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా జడ్జిలు, అధికారులు స్వామి వారిని దర్శనం చేసుకుంటారు. వారితో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తారు. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో రోజుకో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఇప్పటికే ఆలయంలోని గర్భగుడిలో మరమ్మతులు, బయట ఉన్న శిఖారానికి రంగులు వేస్తున్నారు. ప్రత్యేక పూజలు, విశేష హోమాలు, స్వామివార్లకు కల్యాణం వంటి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలు ఇలా...

శ్రీరామలింగేశ్వరస్వామికి స్వస్తిశ్రీ చంద్రమానేన శ్రీ శుభకృత్ నామ సంవత్సర మాఘ బహుళ త్రయోదశి అయిన ఈ నెల 17 నుంచి బ్రహ్మోత్సవాలు మొదలై 21వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరుగుతాయి. 17న రాత్రి 9 గంటలకు అంకురార్పణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18న తెల్లవారు జామున 5 గంటలకు మహా శివరాత్రి ప్రత్యేక అభిషేకాలు, అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారికి లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తారు. 19న ఉదయం 5 గంటలకు శ్రీరామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వాములకు కల్యాణోత్సం జరుగుతుంది. రాత్రి 10 గంటలకు నరనంది వాహనంపై శ్రీ రామలింగేశ్వరస్వామి, రావణ బ్రహ్మ వాహనంపై కన్నేశ్వరస్వామి, ఏనుగువాహనంపై జ్వాలాముఖి, గరుఢవాహనంపై కోదండరామస్వాములను అలంకరించి మడనూరు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం ఈతముక్కల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి ఆ మరుసటి రోజు మడనూరు గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటుంది. నాలుగు దేవుళ్ల శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న తర్వాత 20న సాయంత్రం 4 గంటలకు అమావాస్య గడియలు తప్పించి రథోత్సవం ప్రారంభమవుతుంది. మడనూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు ఈతముక్కల గ్రామానికి చేరుకుంటుంది. ఈతముక్కల గ్రామంలో నిద్రచేసి మరుసటి రోజు 21న గ్రామంలో తిరిగి అక్కడ పూజలు చేసుకుని తిరిగి మడనూరు గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం పాదుకు చేరుతుంది. శివరాత్రి రెండు రోజుల పాటు గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి...

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామలింగేశ్వర ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పది రోజుల నుంచి ఎండోమెంట్ ఈవో జి.రమణారెడ్డి, గ్రామ పెద్ద పుల్లారెడ్డి బ్రహ్మోత్సవాలకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారు. ఆలయం చుట్టూ చెత్తాచెదారం, పిచ్చిచెట్లు తొలగించి కోనేరును శుభ్రం చేయించి మంచినీరు నింపారు. ఆలయంలోని విగ్రహాలకు రంగులు వేశారు. రథాన్ని శుభ్రం చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు వెంట ఉన్న బల్లలు, చిరు వ్యాపారస్తులను దూర ప్రాంతాలకు తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈవో కోరారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- మూడు సచివాలయాల పరిధిలో రూ.48 లక్షల బకాయిలు
- వసూలు చేసేందుకు సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు



పన్నుల వసూళ్లపై సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని మూడు వార్డు సచివాలయాల పరిధిలో రూ.48 లక్షల పన్ను బకాయిలు ఉన్నాయని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక గాంధీనగర్, శివప్రసాద్‌కాలనీ, పీర్లమాన్యం సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించారు. సచివాలయాల సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ మూడు సచివాలయాల పరిధిలో రూ.1.40 కోట్లు డిమాండ్ ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.92 లక్షలు మాత్రమే వసూలయ్యాయన్నారు. మరో రూ.48 లక్షలను మార్చి నెలాఖరులోపు వసూలు చేయాలని దిశానిర్దేశం చేశారు. సమీక్షల అనంతరం స్వయంగా సచివాలయ సిబ్బంది, ఒంగోలు నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికీ కమిషనర్ పర్యటించారు. ప్రశాంతి రెసిడెన్సీతో పాటు ఆయా ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి పెండింగ్‌లో ఉన్న పన్నులు చెల్లించాలని ప్రజలకు సూచించారు. గాంధీనగర్ సచివాలయం పరిధిలో ఒక్కరోజులోనే రూ.98 వేలు వసూలు చేశారు. అదేవిధంగా పీర్లమాన్యం సచివాలయం పరిధిలో కూడా పర్యటించి పన్నులు వసూలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దిరెడ్డి నియంతా విజయభాస్కరరెడ్డి, గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ తిరుపతిరావు, ఆర్‌ఐలు అఖండ్‌కుమార్, మిరియాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల విధుల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఆర్‌ఐవోకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు

ఒంగోలు టౌన్: ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు, మార్చి 15 నుంచి నిర్వహించనున్న థియరీ పరీక్షల విధుల కేటాయింపులో కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు శనివారం జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో ఏ సైమన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రాక్టికల్ ఎగ్జామినర్లు, స్క్వాడ్ ఆఫీసర్ల నియామకాల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే థియరీ పరీక్షల్లో సీఎస్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లు, స్క్వాడ్ అధికారుల నియామకాల్లోనూ తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పి.మాధవరావు, ఎస్.కుసుమకుమార్, షేక్ సైదులు, వై.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు పనులు ప్రారంభం



ఏపుగా పెరిగిన పొగ తోట



గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



సిద్ధమైన బేళ్లు

- బిజీబిజీగా రైతులు, కూలీలు
- బ్యారన్ పనులతో అధిక సంఖ్యలో కూలీలకు ఉపాధి

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో సాగుచేసిన పొగాకు పంట ఆకు కొట్టుడుకు రావడంతో రైతులు, రైతు కూలీలు ఆ పనుల్లో నిమగ్నమై బిజీబిజీగా మారారు. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ పొగాకు రైతులు మండలంలో విస్తారంగా పంట సాగుచేశారు. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదలకు పొగ తోటలు కొట్టుకుపోయాయి. ఏపుగా పెరిగిన తోటలు సైతం కుళ్లిపోయి ఎండిపోయాయి. పోయిన చోటే వెతుక్కోవాలన్న భావనతో ప్రభుత్వ సహకారంతో రైతులు మళ్లీ పొగనాట్లు వేశారు. పూర్తిగా కొట్టుకుపోయిన చోట కూడా మూటకు రూ.2000 వెచ్చించి పొగనారు కొని నాట్లు వేశారు. మెట్ట పొలాల్లో వేసిన పొగ తోటల్లో ప్రస్తుతం ఆకు కొడుతున్నారు. పొగ తోటల నుంచి రెలుపు చేసిన ఆకును కర్రలకు కట్టి బ్యారన్లకు చేర్చారు. కొన్నిచోట్ల క్యూరింగ్ పనులు కూడా మొదలవడంతో అధిక సంఖ్యలో కూలీలకు ఉపాధి దొరికింది. క్యూరింగ్ చేసిన వాటిని మద్దెలకు వేసి గ్రేడింగ్ చేయడం రెండు దశల్లో జరుగుతోంది. నిపుణులైన గ్రేడింగ్ కార్మికులచే 1, 2, 3, 4 నంబర్లు అంటూ గ్రేడింగ్ చేయిస్తున్నారు. ఎలాంటి పదార్థాలుగానీ, మట్టి, కాగితాలు లేకుండా బేళ్లు కడుతున్నారు. పలు గ్రామాల్లో వేలం కేంద్రాలకు తరలించేందుకు బేళ్లను కూడా సిద్ధం చేశారు. గత సంవత్సరం అత్యధిక ధర కేజీ రూ.180 పలకగా, కనిష్ఠ ధర రూ.110 పలికి వేలం పూర్తయ్యే వరకు స్థిరంగా ఉంది. దీంతో పొగాకు రైతులకు మంచి లాభాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా పొగాకు రైతులు ఆశల సాగు చేపట్టారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని గిట్టుబాటు ధరలు కల్పించాలని పొగాకు రైతులు కోరుకున్నారు.



క్యూరింగ్ చేసిన పొగాకు